## క్లుప్తంగా

### అండగా నిలిచిన ఎమ్మెల్సీ కవిత



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన గున్నాల లక్ష్మి, నర్సింలు కుటుంబానికి ఎమ్మెల్సీ కవిత అండగా నిలిచింది. వీరి కుమార్తె వివాహం శుక్రవారం సదాశివనగర్‌లో నిర్వహించారు. లక్ష్మి, నర్సింలు పేద కుటుంబానికి చెందిన వారని స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకెళ్లారు. గొప్ప మనస్సుతో ఆమె రూ.50 వేలు పంపించడంతో ఆ నగదును ఎంపీపీ గైని అనసూయ రమేశ్, జెడ్పీటీసీ కమిలి నర్సింలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి కలిసి వారికి అందించారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



లింగంపేట(ఎల్లారెడ్డి): పర్మళ్ల గ్రామానికి చెందిన కుమార్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం మండల పార్టీ అధ్యక్షుడు దివిటి రమేశ్ అందజేశారు. కుమార్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. నిరుపేద కావడంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. దాంతో ఆయనకు ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ సిద్దారెడ్డి, రవీందర్‌నాయక్, జిలియా నాయక్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులే సమాజానికి మార్గ నిర్దేశకులు



రాజంపేట: ఉపాధ్యాయులే సమాజానికి మార్గ నిర్దేశకులని ఎంపీపీ లింగాల స్వరూప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన మండల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులను ప్రగతి పంథాలో నడిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 15 మందిని శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. జెడ్పీటీసీ కొండ హన్మండ్లు, ఎంఈవో రామస్వామి, నోడల్ అధికారి సాయిరెడ్డి, కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు నళిని, పీఆర్‌టీయూ నాయకులు నర్సారెడ్డి పాల్గొన్నారు.

### భిక్కనూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంకు..



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): భిక్కనూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వారాల ఆంజనేయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును అందుకోవడంతో ఉప సర్పంచ్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, గ్రామస్తులు శుక్రవారం శాలువా, పూల మాలతో సన్మానించారు.

### లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..



కామారెడ్డి టౌన్: లయన్స్ క్లబ్(కామారెడ్డి) ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్ ఫోరం హాల్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు వెంకటి, కరుణ, చిన్నాగౌడ్, నీరజ, స్వప్న, శ్రీనివాస్‌లను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాజన్న, కార్యదర్శి శ్యాంగోపాల్‌రావు, జోనల్ చైర్మన్ నర్సింహం, కోశాధికారి అశోక్, ప్రతినిధులు దామోదర్‌రెడ్డి, తదితరులున్నారు.

### టార్పాలిన్లు, వంట సామగ్రి పంపిణీ



భిక్కనూరు: తిప్పాపూర్‌లోని నిరుపేదలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో టార్పాలిన్లు, వంట సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్ల పైకప్పులు దెబ్బతిన్న 12 మంది నిరుపేదలకు టార్పాలిన్లు, వంట సామగ్రిని అందజేశారు. తహసీల్దార్ శివప్రసాద్, రెడ్‌క్రాస్ సొసైటీ డివిజన్ చైర్మన్ రమేశ్, ఈసీ సభ్యుడు వెంకటేశం, ఎంపీటీసీ ఫోరం మండల కన్వీనర్ సాయిరెడ్డి, భిక్కనూరు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నర్సింలు, సర్పంచ్ స్వామి పాల్గొన్నారు.

# ఇరుకు గదులకు ఇక చెల్లు

- రెండు కొత్త గ్రామ పంచాయతీలకు భవనాలు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామాల సర్పంచ్‌లు



సదాశివనగర్‌లో నిర్మిస్తున్న జీపీ భవనం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): నూతనంగా మంజూరైన గ్రామ పంచాయతీలకు సొంత భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయించడంతో ఆ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సొంతంగా పంచాయతీ భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో, కొన్ని గ్రామాల్లో ఇరుకు గదుల్లో పంచాయతీలను కొనసాగించాల్సిన పరిస్థితి ఉండేది. భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించడం వల్ల కొంత ఊరటనిచ్చినట్లయింది. సర్పంచ్‌కు, పంచాయతీ కార్యదర్శికి వేర్వేరు గదుల నిర్మాణంతో పాటు సమావేశపు హాల్ ఉండే విధంగా నిర్మాణం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలోనే భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. గతంలో పద్మాజీవాడి, తిమ్మోజీవాడి గ్రామాల్లో నూతన జీపీ భవనాలు నిర్మించారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద మండల కేంద్రంతో పాటు కల్వరాల్, వజ్జపల్లి తండా, సాజ్యానాయక్ తండాలలో జీపీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఒక్కో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు కాగా కల్వరాల్‌లో జీపీ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సదాశివనగర్‌లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. నూతనంగా గ్రామ పంచాయతీలుగా ఏర్పడ్డ వజ్జపల్లి తండా, సాజ్యానాయక్ తండాలలో పంచాయితీ భవనాల నిర్మాణాలకు టెండర్ ప్రక్రియ పూర్తి కానందున పనులు ప్రారంభం కాలేదు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

### ఇబ్బందులు తొలగిపోతాయి



గ్రామ పంచాయితీ భవన నిర్మాణంతో ఇబ్బందులు తొలగిపోతాయి. ప్రస్తుతం ఇరుకు గదిలో పంచాయతీ భవనం కొనసాగుతోంది. దీంతో సమావేశాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించారు. ఎమ్మెల్యేకు ధన్యవాదాలు.

– బద్దం శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్, సదాశివనగర్

## పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



భిక్కనూరులో మాట్లాడుతున్న ఎస్సై సాయికుమార్



దోమకొండలో మాట్లాడుతున్న ఎస్సై మురళి

దోమకొండ/భిక్కనూరు: వినాయక చవితి పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని దోమకొండ ఎస్సై మురళి, భిక్కనూరు ఎస్సై సాయి కుమార్ సూచించారురు. శుక్రవారం దోమకొండ, భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. ప్రతి మండపం నిర్వాహకులు ఎలాంటి గొడవలు జరగకుండా పండుగ వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలన్నారు. అల్లర్లకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. మండపాల సమాచారం పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చి సహకరించాలన్నారు. రాత్రి పూట మైక్‌లు, లౌడ్ స్పీకర్లను అనవసరంగా వాడవద్దని, ప్రజల నిద్రకు భంగం కలగకుండా ఉపయోగించాలన్నారు. నిమజ్జనం రోజు చెరువుల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు.

## బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో ఎస్. రాజుకు వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అక్రమాలు, అన్యాయాలు జరగకుండా రోస్టర్ కమ్ మెరిట్ సీనియారిటీ ప్రకారం పదోన్నతులు, బదిలీలు జరిగేలా చూడాలని జిల్లా అధ్యక్షుడు భిక్కనూరి యాదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యల సంతోష్‌లు కోరారు. జీవో–5 అమలు చేసి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. అర్హత ఉన్నవారికి న్యాయం చేయాలన్నారు.

## 'పాడి రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా'



మేనూర్ పశువైద్యుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

మద్నూర్(జుక్కల్): పాడి రైతులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తానని నూతనంగా వచ్చిన మేనూర్ పశు వైద్యాధికారి సంతోష్ పేర్కొన్నారు. మండలంలోని మేనూర్ పశు వైద్యశాలలో శుక్రవారం మేనూర్, చుట్టు పక్కల గ్రామాల పాడి రైతులు, పశువుల కాపరులు నూతనంగా వచ్చిన పశువైద్యాధికారి సంతోష్‌ను ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. గ్రామాలలో పశువులకు వైద్యం అవసరం ఉంటే మేనూర్‌లోని పశువైద్యశాలకు తీసుకొస్తే వైద్యం అందిస్తామని ఆయన చెప్పారు.

## గడప గడపకు కాంగ్రెస్



బాన్సువాడ : బీర్కూర్ మండలం చించోలిలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీర్కూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.500లకే సిలిండర్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రూ.4 వేలు ఆసరా పింఛన్లు ఇస్తామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. మున్సిపల్ కౌన్సిలర్ కాసుల రోహిత్, నాయకులు హన్మాండ్లు, తోట ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

### వ్యాసరచన పోటీలు



పిట్లం(జుక్కల్): అన్నారం ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన బహుమతులు ప్రదానం చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కిషన్, హెచ్‌ఎం గణపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### బాధితునికి సెల్‌ఫోన్ అప్పగింత

లింగంపేట(ఎల్లారెడ్డి): పొల్కంపేట తండాకు చెందిన అంబర్‌సింగ్‌కు శుక్రవారం ఎస్సై ప్రభాకర్ సెల్‌ఫోన్ అప్పగించారు. అంబర్ సింగ్ మొబైల్ ఫోన్ ఐదు నెలల క్రితం చోరీకి గురైంది. ఈ విషయాన్ని బాధితుడు లింగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.



## సంక్షిప్తం

### ఎల్లారెడ్డి నుంచి బీజేపీ అభ్యర్థిగా దరఖాస్తు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సదాశివనగర్ మండలంలోని ధర్మారావ్‌పేట్‌కు చెందిన ఎంపీటీసీ, బీజేపీ జిల్లా కార్యదర్శి నాయని మహిపాల్ యాదవ్ హైదరాబాద్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలన్నారు. బడుగు బలహీనవర్గాలకు చెందిన మహిపాల్ యాదవ్‌కు ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం ఉంది. తెలంగాణ ఉద్యమంలో, విద్యార్థి సంఘాల తరఫున చేపట్టిన ఉద్యమాల్లో పాల్గొన్న అనుభవం కూడా ఉంది.

### షబ్బీర్ అలీకి మద్దతు ప్రకటించిన 140 గంగపుత్ర కుటుంబాలు



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఇసాయిపేటకు చెందిన 140 గంగపుత్ర కుటుంబాలు శుక్రవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీకి మద్దతు ప్రకటించాయి. కామారెడ్డిలోని ఆయన నివాసానికి వెళ్లిన గంగపుత్ర కుటుంబాలు రాబోయే ఎన్నికలలో షబ్బీర్ అలీకి ఓటు వేసి గెలిపించుకుంటామన్నారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు సమానంగా సంక్షేమ ఫలాలు అందిస్తామని వెల్లడించారు.

### 'హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ రికార్డు సృష్టిస్తారు'



ఎల్లారెడ్డి: తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి సీఎంగా కేసీఆర్ పదవి చేపట్టి హ్యాట్రిక్ సీఎంగా నిలుస్తారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాంధారి మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వంద మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే బీఆర్ఎస్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల పట్ల ఆకర్షితులై ఎంతో మంది బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. గాంధారి మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యంరావు, బీఆర్ఎస్ నాయకులున్నారు.

### మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

కామారెడ్డి టౌన్: మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికులను ప్రభుత్వం తక్షణమే క్రమబద్ధీకరించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాజనర్సు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఏపీలో ఇస్తున్నట్లుగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.21వేలు చెల్లించాలని, మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి కాకుండా ట్రెజరీ ద్వారా వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రభాకర్, రాజు, అబ్బాస్, శంకర్, రవి, రాజు తదితరులున్నారు.

### కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి



గాంధారి(ఎల్లారెడ్డి): గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సతీష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. గ్రామాల్లో శానిటేషన్ పనులు సక్రమంగా చేయాలన్నారు. ఎన్నికల కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దివ్యాంగులకు వీల్ చైర్‌లు, ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీవో రాజ్‌కిరణ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## సమాచారం..

### నేడు ఎల్లారెడ్డిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ఏఈ సత్యనారాయణగౌడ్ శుక్రవారం తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా 2 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## ఒంటి కాలిపై నిల్చొని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన



కామారెడ్డి టౌన్: నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) స్కీంలో వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను కలిపి క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో చేపడుతున్న ఉద్యోగుల సమ్మె శుక్రవారానికి 9వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో ఒంటి కాలిపై నిల్చుని ఉద్యోగులు నిరసన తెలిపారు. డాటా ఎంట్రీ ఆపరేటర్‌లు, స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టులు, ఎల్‌టీలు, మేల్ అసిస్టెంట్‌లను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దశరత్, ఉద్యోగులు ఎస్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంపై అవగాహన



జిల్లా కేంద్రంలో సీమంతం చేస్తున్న అంగన్‌వాడి సిబ్బంది



ఎల్లారెడ్డిలోని అంగన్‌వాడి కేంద్రంలో..

జిల్లాలోని పలు అంగన్‌వాడి కేంద్రాల్లో శుక్రవారం పోషణ మాసం సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాసం చేయించారు. అలాగే గర్భిణీలకు సామూహిక సీమంతాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



క్యాసంపల్లిలో పౌష్టికాహారం గురించి వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, ప్రజాప్రతినిధులు



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న రామారెడ్డి సర్పంచ్ సంజీవ్, అంగన్‌వాడి సిబ్బంది

## సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న మాచారెడ్డి ఎంపీపీ నర్సింగరావు



మెల్లకుంటతండాలో..

మాచారెడ్డి: ఎల్లంపేటలో శుక్రవారం యాదవ సంఘం భవన నిర్మాణానికి ఎంపీపీ లోయపల్లి నరసింహారావు భూమి పూజ చేశారు. భవన నిర్మాణం కోసం తక్షణమే రూ.3 లక్షలు మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. అలాగే దేవులా నాయక్ తండాలో నీటి ఎద్దడి తీర్చడానికి తన సొంత డబ్బులతో సింగిల్ ఫేజ్ మోటారును అందజేశారు. వైస్ ఎంపీపీ నర్సింహా రెడ్డి, నాయకులు అరవింద్ చంద్రు, రామ్మోహన్, నారాయణ ఉన్నారు.

### మెల్లకుంటతండా జీపీ భవన నిర్మాణానికి..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మెల్లకుంటతండాలో జీపీ భవన నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్ రెడ్డి స్థానిక సర్పంచ్ కేస్లీభాయితో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.20లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. ఎంపీటీసీ సుజాత, ఉపసర్పంచ్ నవీన్, కార్యదర్శి సవాయిసింగ్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య పరీక్షలు

రాజంపేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని ఆర్‌బీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు న్యూట్రిషన్ ప్రాముఖ్యత, పరిశుభ్రతల గురించి అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో వైద్యులు పల్ల హరీష్‌గౌడ్, దివ్యభారతి, ఫార్మాసిస్టు స్వప్న, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం..

### నిత్య పూజలందుకుంటున్న బాలాజీ జెండా



మద్నూర్(జుక్కల్): తిరుమల తిరుపతి బాలాజీ జెండా నిత్య పూజలందు కుంటోంది. నాలుగు రోజుల క్రితం తిరుపతి శ్రీవారి దగ్గరి నుంచి మద్నూర్ మండల కేంద్రంలో కొలువుదీరిన బాలాజీ జెండాకు భక్తులు ప్రతి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఏడుకొండలవాడా వెంకట రమణా గోవిందా అంటూ భక్తుల నామస్మరణతో జెండా ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నిత్యం భజనలు, హారతులు, శ్రీవారి పాటలు, భజన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మరో వారం రోజుల్లో శ్రీవారి బాలాజీ జెండా తిరుపతికి బయలుదేరుతుందని జెండా ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

### విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



బాన్సువాడ రూరల్: పోచారం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం ప్రారంభించారు. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పుష్పమ్మ దంపతులు తొలిరోజు యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్నారు. వేదపండితులు కాశీ సంతోష్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్పీకర్ దంపతులతో పాటు సోదరుడు శంభురెడ్డి, ప్రమీలా దంపతులు, అల్లుడు వెంకట్‌రాంరెడ్డి, అరుణ దంపతులు, పోచారం సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం విగ్రహాలను ఊరేగించారు. సర్పంచ్ పరిగె రాధ, నాయకులు విజయ్‌గౌడ్, లతీఫ్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

### మైసమ్మకు నైవేద్యాల సమర్పణ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారంలో శుక్రవారం కొచ్చరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని భక్తులు మొక్కులు చెల్లించారు.

### సరస్వతి ఆలయంలో శ్రావణ మాస పూజలు



కామారెడ్డి రూరల్: పట్టణ పరిధిలోని ఇల్చిపూర్ శివారులో కొలువుదీరిన సరస్వతి మాత ఆలయంలో శ్రావణమాస చివరి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దత్తాద్రిశర్మ, విజయ్‌పాండే, సూరజ్‌పాండేల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాశన చేయించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, భక్తులు పాల్గొన్నారు.

### శబరిమాత ఆశ్రమంలో ..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు శబరిమాత ప్రతిమ, దివ్య సమాధిని అందంగా అలంకరించారు. అనంతరం పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.